క్లుప్తంగా

సకాలంలో వైద్యసేవలందించాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న రవికుమార్

జి.సిగడాం: రోగులకు సకాలంలో వైద్యసేవలందించాలని జిల్లా మెడికల్ హెల్త్ క్వాలిటీ అధికారి మంత్రి రవికుమార్ సూచించారు. మండలంలోని పెంట గ్రామంలో ఉన్న హెల్త్ కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. కేంద్రం ఆవరణలో పచ్చదనం-పరిశుభ్రత పాటించాలన్నారు. చిన్నారులకు పక్కాగా టీకాలు వేయాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఆయనతో పాటు వైద్యులు బుడుమూరు యశ్వంత్, పేకల సుమబిందు తదితరులు ఉన్నారు.

ఎంఈవోగా సుజాత



శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం మండలం ఎంఈవోగా పెంకి సుజాత నియమితులయ్యారు. ఇదివరకు ఇక్కడ ఎంఈవోగా పనిచేసిన కృష్ణారావు అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన స్థానంలో సుజాత ఎఫ్ఏసీగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె గార మండలంలోని బందరువానిపేటలో హెచ్ఎంగా పనిచేస్తున్నారు.

శక్తి యాప్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసు బృందం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) ఎస్ఎంపురం క్యాంపస్‌లో విద్యార్థినులకు శక్తి యాప్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ రవి ఆధ్వర్యంలో జిల్లా పోలీసు ప్రత్యేక టీమ్ అవగాహన కల్పించింది. ప్రతీ విద్యార్థిని యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అనంతరం మహిళా రక్షణ చట్టాలను వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, పరిపాలన అధికారి మునిరామకృష్ణ, డీన్‌లు శివరామకృష్ణ, గేదెల రవి, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వసంత నవరాత్రి ఉత్సవాలు



వక్త రమేష్‌శర్మను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక ఉపనిషన్మందిరంలో శ్రీరామ వసంత నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా సర్వ మానవాళి ఉత్తరగతులకు ఉత్తరకాండము అనే అంశంపై బంకుపల్లి రమేష్‌శర్మ బుధవారం ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీమద్రామాయణమునకు బీజం ఉత్తరకాండమని పేర్కొన్నారు. ఉత్తర కాండలో సీతమ్మవారు లవకుశలను శ్రీరామునికి అప్పగించి, తన తల్లి భూమాత ఒడిలోకి చేరుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బి.కోమలరావు, బాబూరావు, కామేశ్వరరావు, విశ్వేశ్వరరావు, మల్లేశ్వరరావు, జగదాంబ, అనురాధ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అష్టోత్తర శత దీపారాధన



విజయ గణపతికి దీపారాధనలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న విజయ గణపతి దేవాలయంలో స్వామివారికి అష్టోత్తర శత దీపారాధనలు బుధవారం జరిగాయి. ఆలయ అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిర్వహణ మెరుగ్గా ఉండాలి

ఎచ్చెర్ల క్యాంపస్: చెత్త సంపద కేంద్రాల నిర్వహణ మెరుగ్గా ఉండాలని శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష అన్నారు. చిలకపాలేంలోని చెత్త సంపద కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. నిర్వహణ సరిగా లేదని, అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో చెత్త సేకరించడం, చెత్త తరలించడం, తడి, పొడి చెత్త వేరు చేసి ఎరువులు తయారు చేయడం చేయాలని సూచించారు. ఆమెతో పాటు డీఎల్‌పీవో ఐ.వి.రమణ ఉన్నారు.

ఎండుగడ్డికి గడ్డుకాలం

- వెంటాడుతున్న పశుగ్రాసం కొరత
- ఖరీఫ్ పంటలు పండకపోవడంతో ఇబ్బందులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పాడి రైతులు



కొనుగోలు చేసిన వరిగడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: పశు పోషణలో వరి ఎండుగడ్డి అత్యంత కీలకం. ప్రత్యామ్నాయంగా మాత్రమే పచ్చగడ్డి, ఇతర ఆహారం తవుడు, మినరల్ మిక్చర్ ప్యాకెట్లు వంటివి వినియోగిస్తారు. పశువుల ఆకలి తీర్చేది ఎండు గడ్డి మాత్రమే. అయితే ప్రస్తుతం ఎచ్చెర్ల నియోజకవర్గంలోని ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల్లో వరి ఎండుగడ్డికి పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది ఖరీఫ్‌లో వరి పంటలు చాలా వరకు ఎండిపోవడం ప్రధాన సమస్యగా మారింది. రణస్థలం, లావేరు మండలాలకు సాగునీరు అందించే తోటపల్లి, ఎచ్చెర్లకు నీరు అందించే నారాయణపురం, జి.సిగడాం మండలానికి నీరు అందించే మడ్డువలస ప్రాజెక్టుల్లో నీటి సమస్య ఏర్పడడంతో, శివారు ప్రాంతాలకు సాగునీరు అందక పంటలు సరిగా పండలేదు. దీంతో వరిగడ్డి దొరకడం సమస్యగా మారింది. ఫలితంగా ఒక్కసారిగా ధరలు పెరిగిపోయాయి. ట్రాక్టర్ గడ్డి రవాణాతో కలిపి రూ.6 వేల నుంచి రూ.7 వేలు పలుకుతోంది. ఆవులు, గేదెలు, ఎద్దులు సుమారు 60 వేల వరకు నియోజకవర్గంలో ఉన్నాయి.

ధరలు మండుతున్నాయి



ఎప్పుడూ లేనివిధంగా ఎండు గడ్డి ధరలు పెరిగాయి. ఈ ఏడాది పంటలు సరిగా పండకపోవడం వలన సమస్య ఎదురైంది. జలుమూరు, పోలాకి, సంత కవిటి వంటి ప్రాంతాలు నుంచి ఎండిగడ్డి తెచ్చి అమ్ముతున్నారు. దూరం ఆధారంగా రూ.6 వేల నుంచి రూ.7 వేల మధ్య ధర పలుకుతోంది. మరోపక్క పాల ధరలు తగ్గడం ఆందోళన కలిగిస్తోంది.

– పైడి రమణమూర్తి, పాడిరైతు, ఫరీదుపేట

పోషణ భారంగా మారుతోంది



ప్రస్తుతం వరి ఎండుగడ్డి ధరలు ఆకాశానంటుతున్నాయి. పాల ధరలు తగ్గుతున్నాయి. పశుపోషణ భారంగా మారుతోంది. ఆర్థికంగా ఇబ్బందిగా ఉంది. భవిష్యత్‌లో పశు పోషణ ఇంకా కష్టంగా మారుతుంది. ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు ఇవ్వాలి. పాడి పరిశ్రమకు చేయూత అందించాలి.

– సీపాన శ్రీనివాసరావు, పాడిరైతు, ఫరీదుపేట

సరఫరా చేయాలి



ప్రస్తుతం ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని కరువు వెంటాడుతోంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటలు ఎండిపోయాయి. ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని కరువు నియోజకవర్గంగా ప్రకటించాలి. ఎండు వరిగడ్డి రాయతీపై అందజేయాలి. ప్రస్తుతం వరి గడ్డి అందుబాటులో లేకపోవడంతో పశుపోషణ చేస్తున్న వారికి ఆర్థిక భారంగా మారింది.

– సనపల నారాయణరావు, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి

వృథాగా పైపులు



వేసవి మొదలవ్వడంతో శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ఎక్కడికక్కడ పైపులైన్ల లీకులు, ప్రధాన నీటి వనరులున్న చోట ఇసుక అక్రమ తవ్వకాలు వంటివి చేయడంతో నగరంలో అరకొరగానే తాగునీరు సరఫరా చేస్తున్నారు. విలీన పంచాయతీలకు కొత్తగా పైపులైన్లు వేసి నీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. కాగా నగరంలోని ఆర్ట్స్ కాలేజీ వద్దనున్న మంచినీటి పంప్‌హౌస్ వద్ద నిరుపయోగంగా వందలాది తాగునీటి పైపులు పడి ఉన్నాయి. దీంతో ప్రజాధనం వృథా అవుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి వాటిని వినియోగంలోకి తీసుకు రావాలని కోరుతున్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

ప్రారంభమెన్నడో..?



ఎచ్చెర్ల మండలంలోని బొంతల కోడూరు గ్రామంలో నిర్మించిన రైతు సేవా కేంద్రం ఐదు నెలల క్రితం పూర్తయ్యింది. రూ.25 లక్షల ఉపాధి పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో ఈ భవనం నిర్మించారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు సైతం చెల్లించారు. కానీ భవనం ప్రారంభానికి మాత్రం నోచుకోవడం లేదు. ప్రస్తుతం పాత సామాజిక భవనంలో రైతుసేవా కేంద్రం నిర్వహిస్తున్నారు. అందువలన కొత్త భవనాన్ని వినియోగంలోకి తీసుకు రావాలని రైతులు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

అయ్యప్పకు పూజలు



శ్రీకాకుళం పట్టణంలోని బలగలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం స్వామివారికి క్షీరాభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకులు దేవరకొండ శంకరనారాయణ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాల అనంతరం ప్రత్యేకంగా అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రెడ్డి చిరంజీవులు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

ఈకేవైసీ చేయించుకోకపోతే రేషన్ కట్



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీకాంత్

జి.సిగడాం: ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోకపోతే రేషన్ నిలుపుదల చేయడం జరుగుతుందని తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ స్పష్టం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతీ రేషన్‌కార్డు లబ్ధిదారులు తప్పనిసరిగా డీలర్ల వద్ద ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులు పరిష్కారమయ్యేలా సంబంధిత వీఆర్వోలు చర్యలు తీసుకోవాలని సూచించారు. వన్-బీ రాకపోతే తక్షణమే ఆ గ్రామం వీఆర్వో లేదా నేరుగా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. విధి నిర్వహణలో ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్లు ఎస్.నిర్మల, కె.గాయత్రి, ఆర్ఐ రాధ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల క్రమబద్ధీకరణకు అవకాశం



తహసీల్దార్ గణపతిరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు కట్టుకొని నివాసముంటున్న పేద ప్రజలు, తమ ఇళ్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం జీవో 30ని విడుదల చేసిందని తహసీల్దార్ గణపతిరావు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉన్న నివాసాలకు మాత్రమే ఇది వర్తిస్తుందని వివరించారు. క్రమబద్ధీకరణ దరఖాస్తులను వార్డు, గ్రామ సచివాలయాల్లో సమర్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షల కంటే తక్కువ వార్షిక ఆదాయం కలిగిన వారు మాత్రమే ఈ స్కీమ్‌కు అర్హులని స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకునేవారి కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి, ఆదాయ పన్ను చెల్లింపులు చేసినవారు ఉండకూడదని స్పష్టం చేశారు. అర్హులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎన్ఎస్ఎస్ శిబిరం



మాట్లాడుతున్న అసోసియేట్ డీన్ భరతలక్ష్మి

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని శిలగాం శింగువలస గ్రామంలో నైరా వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ క్యాంప్ బుధవారం ప్రారంభమయ్యింది. కళాశాల అసోసియేట్ డీన్ భరతలక్ష్మి ప్రారంభించగా, ముఖ్య అతిథిగా నెహ్రూ యువకేంద్రం కో-ఆర్డినేటర్ కె.ఉజ్వలవెంకట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉజ్వలవెంకట్ మాట్లాడుతూ.. రైతులు, గ్రామస్తులంతా కలిసి విద్యార్థులకు సహకరించాలన్నారు. వ్యవసాయానికి ఉపయోగపడే విధివిధానాలను విద్యార్థుల ద్వారా తెలుసుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ క్యాంప్ వలన విద్యార్థులకు గ్రామీణ పరిస్థితులు, గ్రామ సమస్యలు, గ్రామ అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోవాలో తెలుస్తుందన్నారు.

నడకతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

శ్రీకాకుళం: ప్రతిరోజూ నడవడం వలన సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వాకర్స్ క్లబ్ ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, ఎస్.జోగినాయుడులు అన్నారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ వాకింగ్ దినోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నడక వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో పీజీ గుప్త, జి.జగ్గారావు, బీవీ రవిశంకర్, జేసీ పట్నాయక్, అడపా శాంతి, జ్యోతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీవీఎస్ షోరూమ్ సీజ్

శ్రీకాకుళం: నగర పాలక సంస్థ అధికారులు ధర్మాన టీవీఎస్ షోరూమ్‌ను బుధవారం సీజ్ చేశారు. దీంతో షోరూమ్‌లో పనిచేస్తున్న సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. నగర పాలక సంస్థ, సుడా, ఈపీడీసీఎల్ శాఖలు తమను ఇబ్బంది పెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పదిహేనుళ్ల నుంచి విద్యుత్ కనెక్షన్ ఉండగా, అధికారులు వచ్చి షోరూమ్ కనెక్షను నిలిపివేస్తున్నామని చెప్పారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో ట్రేడ్ లైసెన్సు చేయించినా అధికారుల వేధింపులు ఆగలేదన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న బాలభాస్కరశర్మ

ఎచ్చెర్ల: మండలంలో కుంచాలకుర్మయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో బుధవారం వసంత పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి 400 కేజీల కుంకుమతో అభిషేకం చేపట్టారు. మహా మేరువు, శ్రీచక్రాలకు అభిషేకం చేశారు. అనంతరం రాజశ్యామల హోమం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన నూతన కార్యవర్గం



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం సభ్యులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇటీవల ఎన్నికైన శ్రీకాకుళం బార్ నూతన కార్యవర్గం సభ్యులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బార్ కార్యాలయంలో నూతన కార్యవర్గానికి ఇప్పటివరకు ఉన్న అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, కార్యదర్శి ప్రసన్నకుమార్‌లు స్వాగతం పలికి బాధ్యతలు అప్పగించారు. నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా తంగి శివప్రసాద్, ఉపాధ్యక్షుడిగా ఇప్పిలి శీతరాజు, ప్రధాన కార్యదర్శిగా పిట్టా దామోదరరావు, కార్యదర్శిగా మాటూరి భవానీ ప్రసాద్, గ్రంథాలయ కార్యదర్శిగా కొమ్ము రమణమూర్తి, క్రీడా కార్యదర్శిగా తిపురాణ వరప్రసాదరావు, మహిళా ప్రతినిధిగా గురుగుబెల్లి వరజాక్షిలు ఎన్నికైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పలువురు సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని అరసవల్లి మిల్లు జంక్షన్ సమీపంలో ఓ హోటల్ ఎదుట బుధవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో యువతీ యువకులకు గాయాలయ్యాయి. నగరంలోని ఇప్పిలివీధికి చెందిన యోగేశ్వరరావు మరో యువతి శ్రీకూర్మం నుంచి శ్రీకాకుళం వస్తుండగా వెనుక నుంచి వస్తున్న ద్విచక్ర వాహనచోదకుడు ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. క్షతగాత్రులను రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు ఆరా తీస్తున్నారు.

శతశాతం పనులు జరగాలి



మాట్లాడుతున్న డ్వామా పీడీ సుధాకర్

రణస్థలం: రానున్న ఆర్థిక సంవత్సరంలో గుర్తించిన ఉపాధి హామీ పనులన్నీ శతశాతం చేపట్టాలని డ్వామా పీడీ బి.సుధాకర్ సూచించారు. మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గతంలో గుర్తించిన పనులతో పాటు కొత్తగా ఏమైనా పనులు చేయాల్సి ఉంటే, ప్రణాళికలు సిద్ధం చేసి పంపిస్తే ఆమోదం తెలుపుతామని చెప్పారు. ఇప్పటికే రూ.10 కోట్ల వరకు పనులు ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. చెరువు పనుల్లో కొలతలు ఖచ్చితంగా ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో ఏపీవో శ్రీనివాసనాయుడు, ఈసీ గౌరీశంకర్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతి బాధాకరం



మాట్లాడుతున్న అధ్యక్షుడు కృపానందం

శ్రీకాకుళం కల్చరల్: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో క్రైస్తవ ప్రబోధకుడిగా సుపరిచితుడైన పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం అత్యంత బాధాకరమని శ్రీకాకుళం జిల్లా పాస్టర్ అండ్ లీడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రెవ.పి.కృపానందం ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని తెలుగు బాప్టిస్టు చర్చిలో పాస్టర్ ప్రవీణ్ పగడాల సంతాప సభ మైనారిటీ రాష్ట్ర సెక్రటరీ డీవీ కుమార్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో చనిపోలేదని, ఆయన మరణం వెనుక కుట్ర దాగి ఉందని అనుమానం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ రెవ.ఎంవీ జోషఫ్, చర్చి కాపరి రెడెన్ ఆర్.అశోక్‌కుమార్, ట్రినిటీ బాప్టిస్టు చర్చి కాపరి అధికారి జాకబ్, జాన్ డేవిడ్, రెవ.ఎస్.యోకోబు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు



శ్రీకాకుళం రూరల్: మాట్లాడుతున్న ఎంపీడీవో శైలజ



రణస్థలం: ఇంటర్వ్యూలకు హాజరైన దరఖాస్తుదారులు



గార: ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

గార: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు ఆధ్వర్యంలో బీసీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి ఇంటర్వ్యూలు బుధవారం నిర్వహించారు. ఈ రుణాలకు 756 మంది దరఖాస్తు చేసుకోగా, 550 మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు.

రణస్థలం: మండలంలోని 34 పంచాయతీల పరిధిలో బీసీ కార్పొరేషన్ రుణ మేళాకు విశేష స్పందన లభించిందని ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూకు 978 మంది హాజరైనట్లు వెల్లడించారు.

ఎచ్చెర్ల క్యాంపస్: బీసీ కార్పొరేషన్ రుణాలు కోసం చేసుకున్న దరఖాస్తులను ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పరిశీలించారు. నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేశారు. 117 యూనిట్లకు 824 మంది దరఖాస్తులు చేసుకోగా, 525 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఇన్‌చార్జి ఎంపీడీవో బి.మల్లేశ్వరరావు, పరిపాలన అధికారి పీవీఎస్ రామ్మోహన్ పర్యవేక్షించారు. అర్హులకు బ్యాంకు లిల్లింగ్ ద్వారా రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని 24 పంచాయతీల నుంచి బీసీ రుణాలకు 834 దరఖాస్తులు అందాయని శ్రీకాకుళం ఎంపీడీవో బి.శైలజ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తుదారులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వెనుకబడిన తరగతుల వారికి (బీసీ), అగ్రవర్ణాల పేదలకు (ఈడబ్ల్యూఎస్), కాపు కులాలవారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గాను గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి ప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో దరఖాస్తు చేసుకున్నవారు ఉదయం 10 గంటలకు బాపూజీ కళా మందిర్‌లో జరిగే ఇంటర్వ్యూలకు సంబంధిత సర్టిఫికెట్లతో హాజరవ్వాలని కోరారు.

నేడు, రేపు స్పెషల్ ఆధార్ డ్రైవ్

రణస్థలం: మండలంలోని అర్జునవలస, పాతర్లపల్లి, కొచ్చెర్ల, నారువ, కృష్ణాపురం గ్రామ సచివాలయాల్లో గురు, శుక్రవారాల్లో ఆధార్ స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్లు ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదావకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.